సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 27 । ఆగస్టు । 2024



బాస్కెట్‌బాల్‌లో మెరిసారు

మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్‌-16 బాస్కెట్‌బాల్‌ టోర్నీలో జిల్లా బాలికల జట్లు సత్తా చాటాయి. 8లో▸



శివసత్తుల నృత్యాలు

నేడు చేవెళ్ల ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్‌ ఇన్‌

గ్రామాలు, పట్టణాల్లో విషజ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా తదితర సీజనల్‌ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు బాధితులు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై ఫోన్‌ ఇన్‌ ద్వారా చేవెళ్ల ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం: విషజ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా తదితర సీజనల్‌ వ్యాధులు

డాక్టర్‌: రాజేంద్రప్రసాద్‌, చేవెళ్ల ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌

తేదీ: 27-08-2024 (మంగళవారం)

సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్‌ చేయాల్సిన నంబర్‌: **99492 61512**



బోనాల ఊరేగింపులో సందడి

సల్లంగ చూడు పోచమ్మ తల్లి

కడ్తాల్‌ మండల కేంద్రంతో పాటు, మండల పరిధిలోని పలు గ్రామాల్లో పోచమ్మ బోనాలను సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పసుపు కుంకుమలు, రంగులతో చూడ ముచ్చటగా అలంకరించిన బోనం కుండలతో పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించారు. సల్లంగ చూడమ్మ పోచమ్మ తల్లి అంటూ మొక్కుకున్నారు. ఈ సందర్భంగా బోనాల ప్రభల ఊరేగింపు, పోతురాజుల విన్యాసాలు, కళాకారుల ఆటపాటలు హోరెత్తాయి.

– కడ్తాల్‌



కళాకారుల ప్రదర్శన

న్యూస్‌రీల్‌

ఎంఆర్‌పీ కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు

తుర్కయంజాల్‌: ఎంఆర్‌పీ కంటే అధికంగా వస్తువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్‌ అశోక్‌ రావు హెచ్చరించారు. మున్సిపల్‌ పరిధిలోని కమ్మగూడ మిస్టర్‌ ఇరానీ హోటల్‌లో అధిక ధరకు కూల్‌డ్రింక్‌లు విక్రయిస్తున్నారని ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు వచ్చాయి. దీంతో తూనికలు, కొలతల శాఖ అధికారులు సోమవారం అక్కడికి చేరుకుని హోటల్‌ నిర్వాహకులపై కేసు నమోదు చేయడంతో పాటు రిఫ్రిజిరేటర్‌ను సీజ్‌ చేశారు.

రేషన్‌ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

రేషన్‌ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌ బాబు

తుక్కుగూడ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రేషన్‌ డీలర్లకు గౌరవ వేతనం రూ.5 వేలు ఇవ్వాలని రేషన్‌ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్‌ బాబు డిమాండ్‌ చేశారు. తుక్కుగూడలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి లక్ష్మీనారాయణ అధ్యక్షతన రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌ బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. గౌరవ వేతనంతో పాటు రూ.300 కమీషన్‌ కూడా ప్రకటించాలన్నారు. నేటి నుంచి అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బల్లి శ్రీనివాస్‌, ఎండీ సాధిక్‌పాష, హన్మాండ్లు, కిరణ్‌కుమార్‌రెడ్డి, మోహన్‌నాయక్‌, చంద్రశేఖర్‌, భానుచందర్‌, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

‘మదర్‌ డెయిరీ’ ఎన్నికల షెడ్యూల్‌ విడుదల

హయత్‌నగర్‌: హయత్‌నగర్‌లోని నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల సమాఖ్య (నార్మూల్‌ మదర్‌ డెయిరీ)లో డైరెక్టర్ల ఎన్నికకు ఎలక్షన్‌ అధికారి వెంకట్‌రెడ్డి సోమవారం షెడ్యూల్‌ విడుదల చేశారు. సెప్టెంబర్‌ 30తో పదవీ కాలం ముగియనున్న మూడు స్థానాలు, గతంలో వాయిదా పడిన మరో మూడింటిని కలిపి మొత్తం ఆరు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఇందులో రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన రెండు రిజర్వ్‌ స్థానాలు ఉంటాయన్నారు. సెప్టెంబర్‌ 4న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 5న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నామినేషన్ల పరిశీలన, అర్హత సాధించిన నామినేషన్ల ప్రకటన, 6న ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉపసంహరణ ఉంటాయని వివరించారు. ఆ తర్వాత పోటీలో ఉన్నవారి పేర్లు, ఏకగ్రీవమైన స్థానాల్లో అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామన్నారు. సెప్టెంబర్‌ 13న హయత్‌నగర్‌లోని ఎస్‌వీ కన్వెన్షన్‌ హాలులో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్‌ ఉంటుందన్నారు. మరుసటి రోజు ఫలితాలు వెల్లడించనున్నట్టు చెప్పారు. అనంతరం పాలక వర్గ సమావేశం ఏర్పాటు చేసి చైర్మన్‌ ఎన్నిక నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

డిస్కంలో ప్రక్షాళన షురూ!

- ఇప్పటికే ఎస్‌ఈలకు స్థాన చలనం..
- ఒకటి రెండు రోజుల్లో డీఈలు, ఏడీఈలు, ఏఈలు సైతం..

సాక్షి, రంగారెడ్డి: దక్షిణ తెలంగాణ విద్యుత్‌ పంపిణీ సంస్థ అంతర్గత ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఎస్‌ఈలకు స్థాన చలనం కల్పించిన డిస్కం.. రెండు మూడు రోజుల్లో ఏళ్ల తరబడి ఒకే చోట పని చేస్తున్న డీఈ, ఏడీఈ, ఏఈలను కూడా బదిలీ చేయాలని నిర్ణయించింది. రెండున్నరేళ్లుగా ఒకే చోట పని చేస్తున్న వారిని మరో చోటికి బదిలీ చేయాలని భావిస్తుంది. అక్రమాలకు ఏమాత్రం ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా ఈ బదిలీల ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించింది.

ఒత్తిళ్లకు తలొగ్గకుండా..

ప్రభుత్వంలో ఎక్కడా లేని విధంగా డిస్కంలో ఫోకల్‌, నాన్‌ ఫోకల్‌ అంటూ ప్రత్యేక పోస్టులను సృష్టించారు. హైదరాబాద్‌ సౌత్‌, సెంట్రల్‌, హబ్సిగూడ సర్కిళ్లను నాన్‌ఫోకల్‌ ప్రాంతాలుగా, గృహ, వాణిజ్య, పారిశ్రామిక కనెక్షన్లు ఎక్కు వగా ఉండే సైబర్‌సిటీ, రాజేంద్రనగర్‌, మేడ్చల్‌, సరూర్‌నగర్‌, సంగారెడ్డి సర్కిళ్లను ఫోకల్‌ ప్రాంతాలుగా విభజించారు. ఈ ఫోకల్‌ పోస్టుల్లో పోస్టింగ్‌ కోసం చాలా మంది పోటీపడుతుంటారు. రాజకీయ నేతలు, ఉద్యోగ సంఘాల నేతలతో యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చి, కీలక పోస్టులను చేజిక్కించుకునే వారు. ప్రస్తుత యాజమాన్యం ఈ విధానానికి చెక్‌ పెట్టాలని భావిస్తోంది. ఇప్పటి వరకు ఆపరేషన్స్‌ ఫోకల్‌ పోస్టుల్లో పని చేసిన వారిని ఇకపై నాన్‌ ఫోకల్‌ పోస్టులకు మార్చి బదిలీల్లో పారదర్శకతకు పెద్దపీట వేయాలని నిర్ణయించింది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు కూడా చెక్‌ పెట్టే యోచనలో కూడా ఉన్నట్లు తెలిసింది.



50 శాతం మందికి స్థానచలనం?

మూడు రోజుల క్రితం గ్రేటర్‌ పరిధిలోని పది సర్కిళ్ల ఎస్‌ఈలకు స్థాన చలనం కల్పించింది. పనితీరు ఆధారంగా పోస్టులను కట్టబెట్టింది. రెండు మూడు రోజుల్లో డీఈలు, ఏడీఈలు, ఏఈల బదిలీల ఉత్తర్వులు కూడా వెలువడే అవకాశం లేకపోలేదు. ఆపరేషన్స్‌ విభాగంలో 50 శాతం మందికి, ఓఅండ్‌ఎం విభాగంలో 30 శాతం మందికి స్థాన చలనం తప్పదని తెలుస్తోంది.

సభ్యత్వ నమోదుపై దృష్టి



నాయకులు, కార్యకర్తలను సన్మానిస్తున్న రఘునందన్‌రావు

- మెదక్‌ ఎంపీ, బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జి రఘునందన్‌రావు

మొయినాబాద్‌ రూరల్‌: సభ్యత్వ నమోదుపై నాయకులు, కార్యకర్తలు దృష్టి సారించాలని మెదక్‌ ఎంపీ, బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జి రఘునందన్‌రావు సూచించారు. అజీజ్‌నగర్‌ చౌరస్తాలోని చాందినీ గార్డెన్‌లో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అధ్యక్షతన జిల్లా సభ్యత్వ నమోదు 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. సభ్యత్వం విషయంలో దిశానిర్దేశం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి పార్టీ సిద్ధాంతాల గురించి వివరించి సభ్యత్వం పొందేలా చూడాలన్నారు. నవంబర్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందని.. అప్పటిలోగా సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీచేయాలనుకునే ఆశావహులు గ్రామాల్లో బూత్‌స్థాయిలో కష్టపడి పని చేయాలని, అలాంటి వారికే పార్టీ గుర్తింపుతో పాటు ప్రజల్లో గుర్తింపు ఉంటుందన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తల్లోజు ఆచారి, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అందరూ సిద్ధంగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సంపూర్ణంగా సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని పేర్కొన్నారు. సభ్యత్వ నమోదులో తెలంగాణలోనే జిల్లాను నంబర్‌వన్‌గా నిలిచేలా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్‌కుమార్‌గౌడ్‌, కంజర్ల ప్రకాష్‌, ఎస్‌.మల్లారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్‌రాజ్‌యాదవ్‌, పాపయ్యగౌడ్‌, బోసుపల్లి ప్రతాప్‌, కేఎస్‌ రత్నం, మాడి మధుసూదన్‌రెడ్డి, మోర నర్సింహారెడ్డి, మహిళా సభ్యత్వ కో కన్వీనర్‌ శ్రీలత, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా సర్వరోగ నివారిణి కాదు

- కూల్చివేతల్లో చిత్తశుద్ధిని చాటుకోవాలి
- వ్యక్తిగత కక్షతో చేపట్టడం సరికాదు
- చెరువులు, ప్రభుత్వ భూముల్లో అనుమతులిచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి
- కూల్చివేతల పేరుతో పేదల జోలికొస్తే ఊరుకోం
- ప్రభుత్వానికి గ్రేటర్‌ జిల్లాల బీజేపీ అధ్యక్షుల హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

సాక్షి, రంగారెడ్డి: ‘ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, అటవీ భూములు, అసైన్డ్‌, భూదాన్‌ భూములను పరిరక్షించాల్సిందే. ఈ విషయంలో ఎలాంటి రాజీలేదు. ఉద్దేశపూర్వకంగా కూల్చివేతలను సహించబోం. ఒక చోట కూల్చివేతలు చేపట్టి.. మరో చోట వదిలేయడం సరికాదు. వరుస పెట్టి అన్ని ఆక్రమణలు తొలగించాల్సిందే. ఆక్రమణల తొలగింపు విషయంలో హైడ్రా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. ఆక్రమణ తొలగింపు పేరుతో ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు తీసుకుని కట్టుకున్న పేదల ఇళ్ల జోలికొస్తే మాత్రం ఊరుకోబోం. కూల్చివేతకు ముందు వాటికి అనుమతులు ఇచ్చిన అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి. ఆ తర్వాతే ఆయా భవనాల జోలికి రావాలి’ అని బీజేపీ గ్రేటర్‌ జిల్లాల అధ్యక్షులు ఎస్‌.మల్లారెడ్డి (మేడ్చల్‌ అర్బన్‌), బి.నర్సింహారెడ్డి (రంగారెడ్డి రూరల్‌), విక్రంరెడ్డి (మేడ్చల్‌ రూరల్‌) అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోమవారం నాంపల్లిలోని బీజేపీ కేంద్రకార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హైడ్రా సర్వరోగ నివారిణి కాదని అన్నారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం కూడా ఆక్రమణల తొలగింపు విషయంలో హడావుడి చేసిందని, ఎన్‌కన్వెన్షన్‌, ఐయ్యప్ప సొసైటీని కూల్చిందని గుర్తు చేశారు. అధికారులు చట్ట ప్రకారం నడుచుకోవాలని, అన్నింటినీ కూల్చి వేయాల్సిందేనని డిమాండ్‌ చేశారు. ఇష్టారాజ్యంగా చేసుకుంటూ పోతే.. బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

చిత్తశుద్ధిగా చర్యలు తీసుకుంటారా?

బొక్క నర్సింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా రూరల్‌ అధ్యక్షుడు

జిల్లాలో చాలా చెరువులు కనుమరుగయ్యాయి. మీర్‌పేట్‌, జిల్లెలగూడ, పహడిషరీఫ్‌, బార్కాస్‌, మీరాలం చెరువులు కబ్జాకు గురయ్యాయి. అన్ని చెరువుల సమాచారాన్ని ప్రభుత్వానికి అందజేస్తాం. నిజాయితీగా వాటిని తొలగించాలి. ఏ కబ్జా వెనుక ఎవరు ఉన్నారు? 111 జీఓ పరిధిలోని ఏ ఫాంహౌస్‌ ఎవరిది? తదితర వివరాలు అందజేస్తాం. వాటిని కూడా కూల్చివేసి ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలి. కేవలం పేదలను టార్గెట్‌ చేయొద్దు. అక్రమ నిర్మాణాలను కూల్చే ముందు చెరువుల్లో వాటి నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన ఆయా అధికారులపై చర్యలు తీసుకోవాలి. పేదలు కట్టుకున్న ఇళ్ల జోలికి వెళ్లొద్దు. ఒకవేళ వెళ్తే.. నష్టపోయిన వారికి ఏ విధంగా న్యాయం చేస్తారో స్పష్టం చేయాలి. మూసీని పూర్తిగా కబ్జా చేశారు. నార్సింగి మూసీ పరివాహక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నిర్మాణాలు వెలుస్తున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఫిరంగి నాలాకు సంబంధించిన భూములు అన్యాక్రాంతమయ్యాయి. కాల్వపై ఉన్న కట్టడాలు కూల్చివేయాలి. ఆక్రమణ దారుల చేతుల్లో నుంచి ఆయా భూములను విడిపించాలి.

చెరువులో చేపల మృత్యువాత

షాద్‌నగర్‌రూరల్‌: ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని సూరమోని చెరువులో సోమవారం చేపలు మృత్యువాత పడ్డాయి. దూసకల్‌ గ్రామశివారులోని చాక్లెట్‌ పరిశ్రమ నుంచి వెలువడుతున్న కెమికల్‌ వ్యర్థాలను యాజమాన్యం బయటకు వదిలేస్తోంది. దీంతో అవి సమీపంలోని సూరమోని చెరువులోకి వెళ్తున్నాయి. చాక్లెట్‌ పరిశ్రమ నుంచి వెలువడుతున్న అత్యంత ప్రమాదకరమైన వ్యర్థపదార్థాలు చెరువు నీటిలో కలుస్తుండడంతోనే చేపలు చనిపోయాయని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. చెరువులో లభించే చేపలపై ఆధారపడి ఎన్నో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, చేపల మృతితో జీవనోపాధిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమ వదుతున్న రసాయనాలు, వ్యర్థాలతో చెరువు నీరు కాలుష్యంగా మారుతోందని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. చేపల మృతికి కారణమైన పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, జీవనోపాధిని కోల్పోయిన తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



సూరమోని చెరువులో తేలియాడుతున్న చేపలు



శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఉన్న చిన్నారులతో అతిథులు

శ్రీకృష్ణుడి మార్గం అనుసరణీయం

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాల వీహెచ్‌పీ క్షేత్రప్రముఖ్‌ బండారి రమేష్‌

షాద్‌నగర్‌రూరల్‌: శ్రీకృష్ణ పరమాత్ముడు చూపించిన మార్గం మనందరికీ అనుసరణీయమని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాల వీహెచ్‌పీ క్షేత్రప్రముఖ్‌ బండారి రమేష్‌ అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని సాయిరాజా ఫంక్షన్‌హాలులో బాలగోపాలసమితి చైర్మన్‌ శ్రీవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బండారి రమేష్‌ మాట్లాడుతూ.. పుట్టుక నుంచి కురుక్షేత్ర సంగ్రామం వరకు శ్రీకృష్ణుడి జీవితం మనకు అనేక బోధనలు చేస్తోందని అన్నారు. శ్రీకృష్ణుడి ఉపదేశంతోపాటు ఆయన జీవితం నేర్పే పాఠాలు ఎన్నో ఉన్నాయన్నారు. హిందూ సంప్రదాయంలో శ్రీకృష్ణ జన్మాష్టమికి ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. కవి, రాజకీయ, సామాజిక విశ్లేషకుడు డాక్టర్‌ భాస్కరయోగి మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడి గొప్పతనం భగవద్గీత, మహాభారతం, శ్రీమద్భాగవతం సహా అనేక హిందూ గ్రంథాల్లో వివరించబడిందని అన్నారు. శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలకు చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించాలని సూచించారు. అనంతరం శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అందె బాబయ్య, వెంకటేశ్‌గుప్తా, యువసత్తా లక్ష్మణ్‌కుమార్‌, టీవీ రంగయ్య, డీవీఎస్‌ స్వామి, నీరజ, వంశీకృష్ణ, అశోక్‌, స్వాతిరెడ్డి, విద్యాసాగర్‌, మదన్‌ మోహన్‌రెడ్డి, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను నిర్లక్ష్యం చేస్తే గుణపాఠం

- చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- బీసీ బిల్లు ప్రవేశపెడతామని రాజకీయ పార్టీలు ప్రకటన చేయాలి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్‌.కృష్ణయ్య



సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌.కృష్ణయ్య

కడ్తాల్‌: బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పిస్తామని.. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెడతామని.. చట్టసభల్లో 50% రిజర్వేషన్లు కల్పిస్తామని దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు స్పష్టమైన ప్రకటన చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్‌.కృష్ణయ్య డిమాండ్‌ చేశారు. బీసీలను నిర్లక్ష్యం చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. మైసిగండి గ్రామ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాలులో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్‌ అధ్యక్షతన సోమవారం రాష్ట్ర స్థాయి బీసీ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌. కృష్ణయ్య మాట్లాడుతూ.. 76 ఏళ్ల స్వతంత్ర భారతంలో 70 కోట్ల మంది బీసీ ప్రజల వాటా బీసీలకు ఇవ్వరా అని ప్రశ్నించారు. బీసీలు బిచ్చగాళ్లు కాదు వాటాదారులని, వాటా ఇవ్వకపోతే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు రూపొందించాలన్నారు. ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌ పార్టీ మేనిఫెస్టోలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు 22 నుంచి 42 శాతానికి పెంచుతామన్న హామీని నెరవేర్చాలని అన్నారు. కులగణన చేపట్టి బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్‌ చేశారు. బీసీల హక్కులు, సమస్యలపై త్వరలో కల్వకుర్తి, నాగర్‌కర్నూల్‌, నల్లగొండ, వరంగల్‌ జిల్లాల్లో లక్షలాదిమంది బీసీలతో సభలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఆలిండియా బీసీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్‌, బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌, బీసీ స్టూడెంట్‌ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, బీసీ రక్షక్‌ దళ్‌ నాయకుడు ఉదయ్‌నేత, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్యయాదవ్‌, బీసీ విద్యార్థి స్టేట్‌ కన్వీనర్‌ భాస్కర్‌, బీసీ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మైసిగండి దేవాలయంలో పూజలు చేసిన శ్రీనివాస్

హైకోర్టు ఎంప్లాయీస్
అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్

ఆమనగల్లు/కడ్తాల్: భారత ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన న్యాయ చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ హైకోర్టు ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరు శ్రీనివాస్ సూచించారు. సోమవారం ఆమనగల్లు మండలంలోని రాంనుంతల గ్రామ పరిధిలోని అయ్యసాగరం త్రిపురాంతకేశ్వరస్వామి దేవాలయంలో సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌తో కలిసి జూలూరి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జూలూరి శ్రీనివాస్‌కు ఆలయ పూజారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పాత చట్టాల స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం చట్టాలను తీసుకువచ్చిందన్నారు. నూతన చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఆయన కోరారు. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక

షాబాద్: డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట్ ఆంజనేయులు ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నగరంలోని బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్‌ఏ) కార్యాలయంలో రాధాకృష్ణ ప్రకటించి ఆహ్వానపత్రాన్ని ఆంజనేయులుకు అందజేశారు. మండలంలోని చర్లగూడ గ్రామానికి చెందిన ఆంజనేయులు ఈ అవార్డు రావడంతో సంతోషాన్ని వ్యక్త పరిచారు. కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎం గౌతమ్, రాష్ట్ర కో–ఆర్డినేటర్ హనుమాన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయులుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రాధాకృష్ణ

ప్రయాణం సాగక.. పడిగాపులు!



కొత్తూరులో వై జంక్షన్ కూడలిలో ట్రాఫిక్ జాం



పెంజర్ల కూడలి వద్ద క్యూ కట్టిన వాహనాలు

- ఎన్‌హెచ్–44పై కొత్తూరు–శంషాబాద్ మార్గంలో ట్రాఫిక్ కష్టాలు
- పలు కూడళ్ల వద్ద తరచూ నిలిచిపోతున్న వాహనాలు
- అత్యవసరంగా వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందులు

కొత్తూరు: అది దేశంలోనే అత్యంత పొడవైన జాతీయ రహదారి.. నిత్యం ఈ రోడ్డు గుండా వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.. మంత్రులు, వీవీఐపీలు తరచూ ఈ మార్గంలో ప్రయాణం చేస్తుంటారు. అంతటి ముఖ్యమైన ఎన్‌హెచ్–44 రహదారిలో కొత్తూరు నుంచి శంషాబాద్ వరకు తరచూ ట్రాఫిక్ జాం అవుతుండడంతో వాహనదారులు, ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఓ వైపు రహదారి విస్తరణ పనులు మరోవైపు పెరిగిన వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ జాం ఏర్పడకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నా ఇబ్బందులు తప్పడం లేదు.

వీటితో నిత్యం ట్రాఫిక్ జాం

- శంషాబాద్ మండలం తొండుపల్లి వద్ద గతేడాది నుంచి వంతెన నిర్మాణాన్ని చేపడుతున్నారు. అసలే ఆ ప్రాంతంలో రోడ్డు ఇరుకుగా ఉండడం.. దానికి తోడు వంతెన పనులు జరుగుతుండడంతో విపరీతమైన ట్రాఫిక్ జాం ఏర్పడుతుంది. ఒక్కోసారి వంతెనకు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి.
- శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న దర్గాను దర్శించుకోవడానికి భక్తులు వాహనాలను రోడ్డు పక్కనే నిలుపుతున్నారు. దీంతో శంషాబాద్ వైపునకు వచ్చే వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంటుంది.
- కొత్తూరు నుంచి శంషాబాద్ వచ్చే రోడ్డులో మదనపల్లితాండ వద్ద వాహనాలు యూటర్న్ తీసుకుంటున్నాయి. ఈ ప్రాంతంలో రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడంతో శంషాబాద్ వైపునకు వచ్చే వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోతున్నాయి.
- కొత్తూరు మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్ చౌరస్తా, చేగూరు రోడ్డులో వాహనాలు యూటర్న్ తీసుకుంటాయి. ఈ కూడళ్లలో కూడా రోడ్డు ఇరుకుగా ఉండడంతో వెనకాల నుంచి వచ్చే వాహనాలు ముందుకు వెళ్లలేక ట్రాఫిక్ జాం అవుతుంది.
- ప్రమాదాల నివారణలో భాగంగా పోలీసులు కొత్తూరు పట్టణంలోని జాతీయ రహదారి వై జంక్షన్ కూడలిను మూసివేశారు. దీంతో షాద్‌నగర్‌కు వెళ్లే వాహనాలు పెంజర్ల రోడ్డులో యూటర్న్ తీసుకుని పట్టణం గుండా వెళ్లాల్సి వస్తుంది. దీంతో పెంజర్ల కూడలిలో ట్రాఫిక్ సమస్య ఎక్కువ అవుతుంది.

అత్యవసర సమయాల్లో అవస్థలు

కొన్ని నెలలుగా కొత్తూరు–శంషాబాద్ వరకు జాతీయ రహదారిపై ఎప్పుడు, ఎక్కడ ట్రాఫిక్ జాం ఏర్పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు రోగులను తరలించే అంబులెన్సులు ఇరుక్కుపోతున్నాయి. ఆయా పనుల నిమిత్తం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనాలు, ప్రజలు ట్రాఫిక్ జాం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కూడళ్లలో నెమ్మదిగా వాహనాలు కదిలే సమయంలో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి.

“ చర్యలు తీసుకుంటున్నాం

కొత్తూరు–శంషాబాద్‌కు వరకు ప్రస్తుతం జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో పలు కూడళ్ల వద్ద రోడ్డు ఇరుకుగా మారింది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్న సమయాల్లో ట్రాఫిక్ జాం ఏర్పడుతుంది. మదన్‌పల్లి దర్గా వద్ద రోడ్డుపై భక్తుల వాహనాలు పార్కింగ్ చేయకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. వాహనదారులు స్వచ్ఛందంగా ట్రాఫిక్ నియంత్రణ పాటించాలి.

– నాగభూషణం, ట్రాఫిక్, ఏసీపీ, శంషాబాద్

నిప్పంటించుకుని తపాలా శాఖ ఉద్యోగి ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులే కారణమని మృతుడి భార్య ఫిర్యాదు

- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు



సురేశ్ (ఫైల్)

మీర్‌పేట: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక తపాలా శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఈ ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ లింగగిరికి చెందిన శీలం కాంతయ్య కుమారుడు శీలం సురేశ్(37) అబిడ్స్‌లోని తపాలా శాఖలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య స్వరూప, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యాపిల్లలతో కలిసి మీర్‌పేట జిల్లెలగూడలోని లలితానగర్‌లో నివాసముంటున్నాడు. కొంత కాలంగా చేసిన అప్పులు తీర్చలేక సురేశ్ బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో భార్య, పిల్లలు ఇంట్లో ఉండగానే బెడ్ రూమ్‌లోకి వెళ్లి గడియ పెట్టుకుని, ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలు రావడాన్ని గమనించిన భార్య స్వరూప వెంటనే సమీప బంధువు ప్రసాదరావుకు ఫోన్ చేయగా, అతను వచ్చేసరికి పెద్దఎత్తున మంటలు, పొగలు వ్యాపించాయి. దీంతో 100కు డయల్ చేశారు. సమాచారం అందుకున్న మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఫైర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేయగా, అప్పటికే సురేశ్ పూర్తిగా కాలిపోయి మృతి చెందాడు. జీవితంపై విరక్తి చెంది సురేశ్ ఆత్మహత్య చేసుకున్నాడని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి: డీసీపీ

శంషాబాద్ రూరల్: వినాయక చవితి ఉత్సవాలను, మండపాల ఏర్పాటు, నిమజ్జనం సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రతలపై నిర్వాహకులు, గ్రామస్తులకు సోమవారం మండలంలోని పెద్దషాపూర్ వద్ద ఉన్న ఫంక్షన్‌హాలులో సమావేశం ఏర్పాటు చేశారు. ఉత్సవాల సయమంలో సంయమనం పాటిస్తూ ప్రశాంతంగా జరుపుకోవాలని డీసీపీ సూచించారు. మండలపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

కుమారుడు పుట్టి చనిపోయాడని..

మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి: కొడుకు పుట్టి చనిపోవడంతో మనస్తాపానికి లోనైన తండ్రి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ పైడి నాయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పద్మశాలిపురం ప్రాంతానికి చెందిన ఆంజనేయులు (26) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడికి దేవరకొండకు ప్రాంతానికి చెందిన సరితతో వివాహం జరిగింది. వారం రోజుల క్రితం వారికి కుమారుడు పుట్టి చనిపోయాడు. అప్పటినుంచి ఆంజనేయులు బాధపడుతూనే ఉన్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు అతడికి చనిపోయిన కొడుకు తిరిగి రాడని నచ్చజెప్పడంతో బెడ్ రూమ్‌లోకి వెళ్లిన అతను ఉదయం ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- హైడ్రాను షాద్‌నగర్‌కు తెచ్చేందుకు సీఎంకు విజ్ఞప్తి చేస్తా

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన హైడ్రా విధానాలతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రకంపనలు రేకెత్తుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని సాహసోపేతమైన నిర్ణయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్నారన్నారు. అక్రమ కట్టడాలపై హైడ్రా అధికారి రంగనాథ్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోనూ అనేక చెరువులు, కుంటలు అన్యాక్రాంతమవుతున్నాయన్నారు. వికారాబాద్ నుంచి నియోజకవర్గంలోని రెడ్డిపాలెం వరకు ఉన్న ఫిరంగి నాలాను కొందరు ధ్వంసం చేసి అక్రమ కట్టడాలు చేపట్టారన్నారు. దీంతో నీటి వనరులు ప్రజలకు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫరూఖ్‌నగర్‌లోని బొబ్బిలిచెరువు భూమి ఆక్రమణకు గురైందని, ఆ భూమిలో చేపట్టిన అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత పాలకుల స్వార్థం, రియల్ వ్యాపారుల లాభాపేక్షతో అక్కమ్మ చెరువు, అంచుకుంట చెరువు కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు. షాద్‌నగర్‌కు హైడ్రాను తీసుకువచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తానన్నారు. అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో నాయకులు బాబర్‌అలీఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, తిరుపతిరెడ్డి, జగదీశ్వర్‌అప్ప, వీరేశం, హరినాథ్‌రెడ్డి, సయ్యద్‌ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

‘సిరిధాన్యాలతో జీవనసిరి’



సదస్సులో మాట్లాడుతున్న పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఖాదర్‌వలి

- చిరుధాన్యాలతోనే ఆరోగ్యం
- దేశంలో 20–25 శాతం మందికి మధుమేహం
- పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఖాదర్ వలి

శంషాబాద్ రూరల్: నిత్యం తీసుకునే ఆహారంలో సిరిధాన్యాలను వినియోగిస్తే ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని పద్మశ్రీ పురస్కార గ్రహీత, స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్ వలి అన్నారు. శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ‘సిరిధాన్యాలతో జీవనసిరి’ అనే అంశంపై రైతు నేస్తం ఫౌండేషన్, స్వర్ణభారత్ ట్రస్ట్ సహకారంతో కర్షక సేవా కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 150 సంవత్సరాల క్రితం మధుమేహం అంటే ఎవరికీ తెలియదని.. కానీ ఇప్పుడు దేశవ్యాప్తంగా 20–25 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నారని.. పుట్టే ప్రతి 100 మంది పిల్లల్లో 10–15 మంది బుద్ధిమాంద్యంతో పుడుతున్నారన్నారు. ఈ సమస్యలన్నింటికీ పోషకాలు లేని ఆహారం తీసుకోవడమే ప్రధాన కారణమన్నారు. పూర్వీకుల ఆహార అలవాట్లు అయిన చిరుధాన్యాలను పక్కకు నెట్టి ఇప్పుడు బియ్యం, గోధుమలు వంటి ఆహారధాన్యాలను వినియోగించేలా మన జీవనశైలి మారిందన్నారు. వీటి ఫలితంగానే మానవ సమాజాన్ని అనారోగ్య సమస్యలు పట్టిపీడిస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ వాడకం, ప్రాసెసింగ్ ఫుడ్, జంక్ ఫుడ్ వంటి విదేశీ ఆహార అలవాట్లను అలవాటు చేసుకోవడం అనారోగ్యాలకు కారణమన్నారు. దీన్ని అధిగమించాలంటే పాలు, టీ, కాఫీ, ప్లాస్టిక్, శుద్ధి చేసిన ఆహారాలను మానేసి.. కొర్రలు, అండుకొర్రలు, అరికలు, సామలు, ఊదలతోపాటు కషాయాలను ఆహారంగా తీసుకుంటే ఆరు నెలల్లో ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో స్వర్ణభారత్ ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డీవీఎస్ రావు, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, డాక్టర్ సరళా ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే నంబర్‌తో రెండు ఆటోలు



ఒకే నంబర్‌పై రెండు ఆటోలు

మైలార్‌దేవ్‌పల్లి: ఒకే రిజిస్ట్రేషన్ నంబర్‌పై రెండు ఆటోలు తిరుగుతుండగా ట్రాఫిక్ పోలీసులు ఆటోలను పట్టుకున్నారు. సోమవారం రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ స్వామి దుర్గానగర్ చౌరస్తాలో విధులు నిర్వహిస్తుండగా రెండు ఆటోలకు ఒకే నెంబరు కనబడడంతో వెంబడించి ఆ ఆటోలను పట్టుకొన్నారు. ఇద్దరు ఆటో డ్రైవర్లను విచారించగా అందులో ఒక ఆటోకు ఒరిజినల్ నంబర్ ఉండగా, మరోకటి అదే నంబర్‌ను పెట్టుకొని తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు ఆటోలను, డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాస్కెట్‌బాల్‌లో మెరిసిన బాలికలు

- చాంపియన్లుగా హైదరాబాద్, మేడ్చల్
- రన్నరప్‌గా నిలిచిన వికారాబాద్ జట్లు
- ముగిసిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ



మూడో స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా బాలికల జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సోమవారం రాష్ట్రస్థాయి అండర్–16 (యూత్) బాస్కెట్‌బాల్ టోర్నీలో చాంపియన్లుగా బాలుర విభాగంలో హైదరాబాద్ జట్టు, బాలికల విభాగంలో మేడ్చల్ మల్కాజిగిరి జట్లు నిలిచాయి. బాల, బాలికల విభాగాల్లో వికారాబాద్ జట్లు రన్నరప్ స్థానాలను దక్కించుకోగా, మూడోస్థానంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి బాలుర విభాగం, బాలికల్లో రంగారెడ్డి జట్లు నిలిచాయి.

హోరాహోరీగా ఫైనల్

బాలుర, బాలికల విభాగం ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. ఆయా జట్లు నువ్వా నేనా అనే రీతిలో తలపడ్డాయి. ఉత్కంఠంగా చివరి వరకు సాగిన బాలుర విభాగం ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 57–53 పాయింట్ల తేడాతో వికారాబాద్ జట్టుపై విజయం సాధించింది. అదేవిధంగా బాలికల ఫైనల్ మ్యాచ్‌లో మేడ్చల్ మల్కాజ్‌గిరి జట్టు 58–56 పాయింట్ల తేడాతో వికారాబాద్ జట్టుపై గెలుపొందింది. బాలుర విభాగం మూడోస్థానం మ్యాచ్‌లో మేడ్చల్ జట్టు 50–40 పాయింట్ల తేడాతో రంగారెడ్డి జట్టుపై, బాలికల మూడోస్థానం మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు 35–7 పాయింట్ల తేడాతో హైదరాబాద్ జట్లపై విజయాలు నమోదు చేసుకున్నాయి.

ట్రోఫీలు అందజేసిన మున్సిపల్ చైర్మన్, డీఎస్పీ

టోర్నీలో విన్నర్, రన్నరప్, మూడోస్థానం జట్లకు మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఇలాంటి టోర్నీలు ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐ అప్పయ్య, రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నార్మన్ ఐజాక్, జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముక్బూద్‌బిన్ అహ్మద్ జాకీర్, నసరుల్లా హైదర్, జిల్లా వాలీబాల్ సంఘం ప్రతినిధి చెన్న వీరయ్య, కౌన్సిలర్లు రామ్, సాదతుల్లా హుస్సేనితోపాటు మీర్ అర్షద్‌అలీ, ఇలియాజ్, ఖాలెద్‌అలీ, ఖలీల్, సుబాన్‌జీ, ముక్రం తదితరులు పాల్గొన్నారు.